సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 16 । జూలై । 2024



నిత్యాన్నదానానికి రూ.51 వేల విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం శిరిగినీడి ఆదినారాయణ, సత్యమణి దంపతులు (పొదలాడ) రూ.51,000 విరాళం అందజేశారు.




నీలి నాలుక.. నిర్లక్ష్యం వద్దు ఇక

వానల రాకతో గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి సోకుతుందని పశు వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి పట్ల నిర్లక్ష్యం కూడదని సూచిస్తున్నారు.

- 8లో ▸

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 91,415 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.40 నీటిమట్టం అడుగులకు చేరింది. కాటన్ బ్యారేజీలోని మొత్తం 175గేట్లకు గానూ 150గేట్లను పైకి లేపి మిగులు జలాలను విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

సర్టిఫికెట్ల పరిశీలనకు ఒకరు హాజరు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో సోమవారం డీఈఈసెట్ రెండవ విడత కౌన్సెలింగ్‌కు ఒక విద్యార్థి హాజరై సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకున్నారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు తెలిపారు. సర్టిఫికెట్లు పరిశీలన అనంతరం ఫైనల్ అడ్మిషన్ లెటర్ అందించామన్నారు.

గెజిట్ ఉపసంహరించుకోకపోతే ఉద్యమమే

కడియం: జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్‌ను వెంటనే ఉపసంహరించుకోకపోతే ఉద్యమానికి సిద్ధమవుతాయని సెకెండ్ గ్రేడ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్‌జీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లగుండ్ల శ్రీనివాసరావు, గరికపాటి సురేష్ తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జీపీఎస్ కన్నా మెరుగైన విధానం తెస్తామని చెప్పి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా గత ప్రభుత్వం తెచ్చిన జీపీఎస్ విధానాన్నే యథాతథంగా అమలు చేస్తామని గెజిట్ విడుదల చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇచ్చిన గెజిట్‌ను ఉపసంహరించుకొని, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. లేకపోతే జీపీఎస్ విధానంపై మరో పోరాటానికి శ్రీకారం చుట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయడం తప్ప మరే ప్రత్యామ్నాయాన్ని తమ సంఘం అంగీకరించదని వారు స్పష్టం చేశారు. అన్ని జిల్లాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులను కలిసి గెజిట్ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తామన్నారు. అంతేకాకుండా ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నప్పటికీ సమావేశం ఏర్పాటు చేయడానికి చొరవ చూపడం లేదన్నారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశం ఏర్పాటుకు చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలను అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ దినేష్‌కుమార్, డీఆర్‌ఓ నరసింహులుతో కలసి ప్రజల నుంచి 121 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఆయా శాఖలకు పరిష్కారం కోసం పంపిన వాటిపై ఏ విధమైన చర్యలు తీసుకొన్నారన్నా నివేదిక సమర్పించాలన్నారు.

పోలీసు కార్యాలయంలో..

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం జరిగింది. జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్.రాజశేఖర్ రాజు ఫిర్యాదుదారుల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు 21 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ ఎస్పీ బాధితుల ఫిర్యాదులను పరిశీలించి, వారి నుంచి వివరాలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి సత్వరమే న్యాయం చేయవలసిందిగా ఉత్తర్వులు ఇచ్చారు. పీజీఆర్ఎస్‌కు సివిల్ కేసులు, కుటుంబ తగాదాలు, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులతో పాటు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి.

భృతి భ్రాంతేనా?

- యువతకు ఉద్యోగాలు లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తానన్న కూటమి ప్రభుత్వం
- అధికారంలోకి వచ్చి నెలరోజులు దాటినా స్పష్టత ఇవ్వని వైనం
- ఎప్పుడిస్తారన్న ప్రకటన కూడా చేయకపోవడంతో నిరుద్యోగుల్లో నిరాశ
- 2014లో సైతం భృతి ఇస్తానని మోసం చేసిన సీఎం చంద్రబాబు
- ప్రస్తుతం మళ్లీ అదే పునరావృతం అవుతుందన్న అనుమానం
- తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 5,09,611 కుటుంబాల ఎదురుచూపులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా ఉద్యోగాల కల్పన
- గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 4,096 మందికి ఉద్యోగాలు



నిరుద్యోగ విద్యార్థులు (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: 'టీడీపీ అధికారంలోకి వచ్చాక ఏటా నాలుగు లక్షల ఉద్యోగాల చొప్పున 20 లక్షల ఉద్యోగాలిస్తాం. నిరుద్యోగులకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తాం తమ్ముళ్లూ..' ఇదీ ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ. ప్రతి ఊరు, ప్రతి సమావేశంలోనూ ఇదే ఊదరగొట్టారు. బాబు ప్రకటనలకు యువత పెద్ద ఎత్తున ఆకర్షితులయ్యారు. కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. ఉద్యోగాల కల్పన అటుంచితే కనీసం నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో ప్రకటించడం లేదు. ఇక్కడే బాబు అసలు నిజస్వరూపం బహిర్గతమైంది. ఈ పరిణామం నిరుద్యోగుల్లో ఆగ్రహావేశాలు నింపుతోంది. సీఎం చంద్రబాబు వ్యవహార శైలి చూస్తుంటే 2014లో తరహా మోసం పునరావృతం అవుతుందేమో అన్న అనుమానం యువత, నిరుద్యోగుల్లో తలెత్తుతోంది.

సూపర్ సిక్స్‌లో భృతికి అత్యంత ప్రాధాన్యం

ఎన్నికల హామీల్లో భాగంగా టీడీపీ రూపొందించిన సూపర్ సిక్స్‌లో యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి మొదటి స్థానంలో ఉంది. జిల్లాలో ఉన్న నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించి ఆదుకుంటానని చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో ఊదరగొట్టారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి అయినా అందజేస్తామని ప్రకటనలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు గడుస్తున్నా రెండు అంశాలపై అతీగతీ లేదు. కనీసం ఎప్పుడు ఇస్తామన్న అంశంపై స్పష్టతే కరవైంది. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే మెగా డీఎస్సీ పేరుతో ప్రకటించిన పోస్టుల భర్తీ సైతం ఇప్పట్లో అయ్యే సూచనలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగాలు వచ్చేస్తాయంటూ డిగ్రీ, ఇంటర్, పదో తరగతి చదివిన విద్యార్థులు ఉద్యోగాల సాధనపై దృష్టి సారించారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి ఉద్యోగం సాధించేందుకు కోచింగ్ సెంటర్ల బాట పడుతున్నారు. ఇప్పటికే రూ.వేలల్లో ఫీజులు చెల్లించి మరీ శిక్షణ పొందుతున్నారు. పట్టణాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో బతుకుబండి లాగుతున్న కుటుంబాలను పరిశీలిస్తే చిరు వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్నవారు ఎందరో కనిపిస్తున్నారు.

కోచింగ్ సెంటర్లకు డిమాండ్

ప్రభుత్వం మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ పోస్టులతో సహా ఏటా 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడంతో యువత, నిరుద్యోగులు వారి స్థాయిలో కోచింగ్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. రూ.వేలు పెట్టి ఇప్పటికే శిక్షణకు చేరిపోయారు. తీరా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు.

జిల్లాలో ఇలా..

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 5,09,611 కుటుంబాలున్నాయి. 18,32,332 జనాభా నివసిస్తోంది. ప్రతి ఏటా ఇంటర్ కళాశాలల నుంచి 3,000, డిగ్రీ కళాశాలల నుంచి 8,000, బీటెక్, ఎంటెక్, డిప్లొమా కోర్సుల నుంచి మరో 2,000 మంది ఉత్తీర్ణులు అవుతున్నారు. ఇందులో కొందరు ఉద్యోగాలు చేస్తున్నా.. మరి కొందరు ఖాళీగా ఉంటున్నారు. ప్రతి ఇంట్లో ఒక్క నిరుద్యోగి అయినా ఉంటున్నారు. అంటే కూటమి ప్రభుత్వం 5.09 లక్షల కుటుంబాలకు ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాల్సి ఉంది. ఉద్యోగాలకు అంత ప్రాధాన్యం ఉన్నా.. నేటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

తూర్పుగోదావరి జిల్లాలో	
మొత్తం కుటుంబాలు	: 5,09,611
జనాభా :	18,32,332
ఏటా వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణత :	13,000
ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిన వారు :	5.09 లక్షలు
అక్షరాస్యత శాతం :	70.2
ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో రిజిస్టర్ చేసుకున్న నిరుద్యోగులు సుమారు :	10,000

ఉపాధి కేంద్రాల్లో వెల్లువలా దరఖాస్తులు

పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులు తమకు ఉద్యోగవకాశాలు కల్పించాలంటూ ఉపాధి కల్పన కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు. మరికొందరైతే ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. చిరు ఉద్యోగం చేసేందుకైనా సిద్ధమైపోతున్నారు. వేతనం తక్కువైనా ఉద్యోగం ఉంటే చాలన్న భావన ప్రస్తుతం నిరుద్యోగుల్లో నెలకొంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ ఇప్పటి వరకు 30,779 మంది ఉద్యోగాల కోసం రిజిస్టర్ చేసుకున్నట్టు ఉపాధి కల్పన అధికారులు వెల్లడిస్తున్నారు. ఇందులో టెన్త్ ఫెయిలైన వారు 229, టెన్త్ పాసైన వారు 3,029, ఇంటర్ 5,682, డిగ్రీ 5,628, డిప్లమా 3,430, ఇతర కోర్సులు చేసిన వారు 12,781 మంది ఉన్నారు.

గతం పునరావృతం అవుతుందా?

2014లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.2 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ప్రగల్భాలు పలికారు. సీఎం పీఠమెక్కి నాలుగేళ్లు పూర్తయినా నయా పైసా ఇవ్వకుండా మోసం చేశారు. తీరా 2019 ఎన్నికలు సమీపిస్తున్నాయన్న సమయంలో కేవలం రెండు నెలలకు మాత్రం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేశారు. ఆయన వ్యూహం ఫలించలేదు. దీనికితోడు ఇంటికో ఉద్యోగం ఇస్తానని నమ్మబలికి ఒక్కరికి సైతం ఉద్యోగం ఇచ్చిన దాఖలాలు లేవు. కొందరికి ప్రైవేటు ఉద్యోగాలు కల్పించి మిన్నకుండిపోయారు. అందుకే 2019 ఎన్నికల్లో చంద్రబాబును ప్రజలు తిరస్కరించారు. ఈ దఫా కూడా అటు ఉద్యోగాలు కల్పించకుండా, ఇటు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు తమను మోసగిస్తారేమోనన్న అన్న అనుమానాన్ని నిరుద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సృష్టించిన వైఎస్ జగన్

2019 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అన్నీ అధికారంలోకి వచ్చాక నిలబెట్టుకున్న ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కింది. గ్రామ, వార్డు సచివాలయాల పేరుతో తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 512 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఒక్కో సచివాలయానికి 8 మంది చొప్పున 4,096 ప్రభుత్వ కొలువులు అందించారు. అంతేగాక విద్య, వైద్య శాఖలో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేశారు. జీరో వేకెన్సీ నినాదంతో ఏ శాఖలోనైనా ఉద్యోగం ఖాళీ ఏర్పడితే వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇలా వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లలో జిల్లాలో 20 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది.



చంద్రబాబు సూపర్‌సిక్స్‌లో మొదటి ప్రాధాన్యతగా ఉన్న ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి

యువతను మోసం చేస్తున్న బాబు



చంద్రబాబు అధికారంలోకి వస్తే మాకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి వస్తుందని యువత అందరూ నమ్మారు. అధికారం చేపట్టి నెల రోజులు కావస్తున్నా నోరు మెదపడం లేదు. స్వప్రయోజనాలకు, పార్టీ నేతలకు ఇసుక డబ్బు పంపిణీలో ఉన్న శ్రద్ధ నిరుద్యోగులకు భృతి ఇచ్చేందుకు చూపడం లేదు.

– తాటిపాక మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి

1.60 లక్షల మంది ఎదురుచూస్తున్నారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల ఉద్యోగాలు, లేని పక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తానని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అధికార పగ్గాలు చేపట్టి నెల రోజులు గడుస్తున్నా.. అతీగతీ లేదు. అసలు ఇస్తారా? లేదా? అనే విషయంలో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. 2019 ఎన్నికల ముందు తూతూ మంత్రంగా ఇచ్చారు. ఇప్పుడు అదే పంథా కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

– తాడేపల్లి విజయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్

స్పష్టత ఇవ్వాలి



జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరి కాకుండా తక్షణమే భృతిని ప్రకటించాలి. ఒక్క నెల నోటిఫికేషన్ ఆలస్యమైతే ఉద్యోగానికి లక్షలాది మంది వయోపరిమితి దాటి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతారు. యువగళంలో నారా లోకేష్ రూ.లక్షల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలి.

– నాగిరెడ్డి మోహన్, ఎంబీఏ, జేగురుపాడు

నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలి



గ్రాడ్యుయేషన్ చదివి జిల్లాలో వేలాదిమంది ఉద్యోగాల అవకాశం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఇప్పటివరకు ఎటువంటి ప్రకటనా రాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగ భృతిని ప్రకటించడంతో పాటు వెంటనే అమలు చేయాలి.

– పిన్నమరెడ్డి దొరబాబు, గ్రాడ్యుయేట్, రాయుడుపాకలు

మోసపూరిత హామీలకు కేరాఫ్ చంద్రబాబు



మోసపూరితమైన హామీలు, అమలు సాధ్యంకాని వరాలతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నాయుడికి వెన్నతో పెట్టిన విద్య. అందులో భాగంగానే యువతను కూడా పలుమార్లు మోసం చేయడం. ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తానంటూ యువతను నమ్మించి, అధికారంలోకి వచ్చాక సవాలక్ష ఆంక్షలు పెట్టి, ఎక్కువ మందికి మేలు చేకూరకుండా చేయడానికే ఆయన ప్రయత్నిస్తారు. నామమాత్రంగా అమలు చేస్తారు. అది కూడా తమ పార్టీ కార్యకర్తలను, సానుభూతిపరులను లబ్ధిదారులుగా ఎంచుకుంటారు. నిజమైన అర్హులకు మాత్రం మేలు చేకూరేలా చేయడు అనేది 2014 ఎన్నికల తరువాత చూశాం. ఇప్పుడు కూడా ఆ చిత్రమే చూపిస్తాడు, నో డౌట్.

– జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే

ఫిబ్రవరిలో అతి రుద్ర మహాయజ్ఞం

దేవరపల్లిలో శివలింగాలను తయారు చేస్తున్న మహిళలు

దేవరపల్లి: రాజమహేంద్రవరంలో వచ్చే ఫిబ్రవరిలో కోటి శివలింగాలకు అభిషేకం, అతి రుద్ర మహాయజ్ఞం నిర్వహించనున్నట్టు సుతాపల్లి లక్ష్మీఅపర్ణ తెలిపారు. దీనికి సంబంధించి భోగలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో బంక మట్టితో కోటి పార్థివ శివలింగాలను తయారు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. దేవరపల్లి ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో ఆర్యవైశ్య, ఆర్యవైశ్య యువజన సంఘం, మహిళా మండలి ఆధ్వర్యంలో 9 రోజుల నుంచి దాదాపు 100 మంది మహిళలు శివలింగాలను తయారు చేస్తున్నట్టు ఆమె చెప్పారు. ఇప్పటి వరకు 65 వేల శివలింగాలను తయారు చేశామని, మంగళవారం నాటికి 75 వేల శివలింగాలను తయారు చేసి రాజమహేంద్రవరం ట్రస్ట్‌కు అందజేస్తామని ఆమె వివరించారు. మాఘమాసంలో కోటి శివలింగాలకు అభిషేకం, రాజశ్యామల సహిత పంచాయతన పూర్వక అతి రుద్ర మహాయజ్ఞం 11 రోజులు 150 మంది పురోహితులతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బంకమట్టి, పచ్చహారతి కర్పూరం, ఆవుపేడ, ఆవు మూత్రం వంటి ఎనిమిది రకాల ధాతువులను కలిపి శివలింగాలను తయారు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. కోరుకొండ, రాజానగరం, రాజమహేంద్రవరం, గోపాలపురం, దేవరపల్లి, చాగల్లు, నిడదవోలులో శివలింగాల తయారీ జరుగుతుందని తెలిపారు. దేవరపల్లి మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు శివలింగాల తయారీలో పాల్గొంటున్నారని ఆమె చెప్పారు.



తయారు చేసిన పార్థివ శివలింగాలు

విమానాశ్రయంలో ఇబ్బంది లేకుండా చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: వర్షాలు, వరదల కారణంగా రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. విమానాశ్రయం విశిష్టత, పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉందని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన ఎయిర్‌ఫీల్డ్ పర్యావరణ నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇరిగేషన్, ఎయిర్ పోర్ట్ అథారిటీ, ఆర్డీవో సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. విమానాశ్రయం చుట్టుపక్కల భవన నిర్మాణాలు, ఇతర కట్టడాలు ప్లాన్‌లకు అనుగుణంగా ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ కె.దినేష్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, రాజమండ్రి ఎయిర్ పోర్ట్ అథారిటీ పోర్ట్ డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్‌రావు, ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి, ఏసీపీ (అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు , జిల్లా అటవీశాఖ అధికారి బి.నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, డీఎల్‌పీవో నాగలత, పంచాయతీ అధికారులు, ఎయిర్ పోర్ట్, పోలీసు, అధికారులు పాల్గొన్నారు.



కుష్టు వ్యాధి నివారణ ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

స్త్రీ సంక్షేమంపై దృష్టి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్త్రీ సంక్షేమం, భద్రత, భరోసా, బాలిక విద్యపై దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ పి. ప్రశాంతి సూచించారు. కలెక్టరేట్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీవోలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. బాలికల, స్త్రీల సంరక్షణ కోసం ఏ వారం – ఈ రోజు ఏ కార్యక్రమం చేయాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. బేటీ పఢావో – బేటీ బచావో యొక్క ముఖ్య ఉద్దేశం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడమేనన్నారు. ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, జిల్లా పిల్లల సంరక్షణ అధికారి రాజ్‌కుమార్, సీడీపీవోలు పాల్గొన్నారు.

కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

జిల్లాను కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జూలై 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ ఇంటింటి సర్వే సందర్భంగా వైద్యాధికారులు, జిల్లా అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోను, యూపీహెచ్‌లలో సస్పెక్ట్ కేసుల సర్వేను సక్సెస్ చేయమని కోరారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎస్.వసుంధర, డీఆర్‌ఓ జి.నర్సింహులు పాల్గొన్నారు.

తలకెక్కించుకోండి..

- వాహనదారులకు శిరస్త్రాణం తప్పనిసరి
- ప్రమాదాల్లో మరణాల నివారణకు అస్త్రం
- ఉమ్మడి జిల్లాలో మూడేళ్లలో 859 మంది మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వాహనదారులకు శిరస్త్రాణం ఎంతో అవసరం.. అదే మన ప్రాణాలకు రక్షణ కవచం.. నిర్లక్ష్యం చేయకుండా 'తల'కెక్కించుకోండని చాలా సందర్భాల్లో పోలీసులు, అధికారులు హెచ్చరించడం చూస్తున్నాం. అయినా అదే నిర్లక్ష్యంతో ఆనందంగా సాగాల్సిన జీవన ప్రయాణంలో అంతులేని విషాదం నింపుకొంటున్న వారెందరో. ఫలితంగా రహదారులు రుధిరంగా మారుతున్నాయి. అయిన వారిని కోల్పోయిన కుటుంబాలు జీవితాంతం దుఃఖ సాగరంలో మునిగిపోతున్నాయి. ఇటీవల కేంద్ర రహదారి భద్రతా సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించాలంటే హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలని తీర్మానించారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లోనే మరణాల శాతం ఎక్కువగా ఉంటోంది. ఈ ఘటనల్లో తల రోడ్డుకు తగిలి బలమైన గాయాలైన సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రతి ఒక్కరూ శిరస్త్రాణం ధరించాలని సూచిస్తున్నారు.

మరణాల్లో యువతే అధికం

ఉమ్మడి జిల్లాలో పరిశీలిస్తే అధిక శాతం యువత ప్రమాదాల బారిన పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను గారాబం చేస్తూ వారి కోరిక మేరకు అధిక సీసీ వాహనాలను కొనిస్తున్నారు. వాటిపై హెల్మెట్ లేకుండా వేగంగా వెళ్తూ, ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. ఇటువంటి ఘటనలపై రాజమహేంద్రవరంతో పాటు కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, జాతీయ రహదారికి అనుకుని ఉన్న గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ఫిర్యాదులొస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 859 మంది మరణించగా, ఇందులో చాలావరకూ హెల్మెట్ లేకపోవడంతోనే మృత్యు పడ్డారని పోలీసులు చెబుతున్నారు.

నిబంధన తీసుకొచ్చినా..

2019లోనే శిరస్త్రాణం తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిబంధన తీసుకువచ్చినా అది అమలు కావడంలేదు. ఎన్నిసార్లు చెప్పినా హెల్మెట్ ధారణపై ప్రజలు పెద్దగా ఆసక్తి చూపకపోవడం, రాజకీయ ఒత్తిడిల కారణంగా ఈ నిబంధనను పోలీసులూ పెద్దగా పట్టించుకోవడం లేదన్న వాదనలు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం లాంటి నగరాల్లో 20 శాతం హెల్మెట్ ధరిస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం మందే ధరిస్తుండటం నిర్లక్ష్యానికి నిదర్శనం. ఉమ్మడి జిల్లాలో మూడేళ్లలో రోడ్డు భద్రతా నిబంధనలు పాటించని కేసులు చాలా నమోదయ్యాయి. 2021లో 3.34 లక్షల కేసులకు రూ.7.55 కోట్లు, 2022లో 2.13 లక్షల కేసులకు రూ.7.89 కోట్లు, 2023లో 3.24 లక్షల కేసులకు రూ.8.60 కోట్ల జరిమానా విధించినట్లు పోలీసులు అధికారులు వివరిస్తున్నారు.



రాజమహేంద్రవరం ఏవీ రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి

ద్విచక్ర వాహన ప్రమాదాలకు కారణాలు

- రోడ్డు మలుపుల వద్ద వేగంగా వెళ్లడం, జాగ్రత్తలు పాటించకపోవడం
- కూడళ్లలో రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా దూకుడుగా వెళ్లడం
- ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళుతూ అదుపు తప్పడం
- మద్యం మత్తు, నిర్లక్ష్యపు డ్రైవింగ్, సెల్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం
- సరైన నైపుణ్యం లేని డ్రైవింగ్, రహదారి భద్రతపై అవగాహన లేకపోవడం

మూడేళ్లలో ఉమ్మడి జిల్లాలో ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021	940	320	640
2022	725	262	760
2023	694	277	780

ప్రాణం విలువైందని తెలుసుకోండి



హెల్మెట్ లేకపోవడం వల్లే ద్విచక్ర వాహన ప్రమాదాల్లో చాలామంది మృతి చెందుతున్నారు. హెల్మెట్ తలకు తగిలించి గడ్డం కింద సేఫ్టీ బెల్ట్ పెట్టుకోవడం లేదు. దీనివల్ల ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ పడిపోయి ప్రాణాలకు ముప్పు వస్తుంది. వారిని రక్షించేందుకు గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదు. ప్రాణం అన్నింటికన్నా విలువైంది. పోలీసులు, రవాణా శాఖాధికారులు కేసులు రాస్తారు, జరిమానాలు విధిస్తారనే కోణంలో కాకుండా మన ప్రాణ రక్షణకు హెల్మెట్ అని గుర్తించండి.

– అంబికా ప్రసాద్, డీఎస్పీ, రాజమహేంద్రవరం.

ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా..



రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని వెంటనే ఆ ప్రాంతం నుంచి పక్కకు తీసుకెళ్లాలి. అతను స్పృహలో ఉన్నాడా లేదా అని గమనించాలి. అంబులెన్స్ వచ్చేలోపు రక్తం కారుతుంటే వెంటనే జేబురుమాలు, లేదా వస్త్రంతో గట్టిగా నొక్కి ఉంచాలి. ఒక క్షణం కూడా ఆలోచించకుండా వెంటనే ఆసుపత్రికి తరలించాలి. పైకి గాయం లేకపోయినా శరీరం లోపల అంతర్గత రక్తస్రావం జరిగి మరణించే ప్రమాదం ఉంది. అలాగే ప్రతి ఒక్కరూ సీపీఆర్ నేర్చుకోవాలి. సీపీఆర్ డాక్టరు మాత్రమే చేసేది కాదు, ప్రమాదానికి గురైన వ్యక్తిని కాపాడేందుకు ఇది చాలా అవసరం.

– వద్దాది సురేష్, ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుడు, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

ట్యాంకర్ బోల్తా



హైవేపై బోల్తా పడిన అల్యూమినియం పౌడర్ లోడు ట్యాంకర్

తుని రూరల్: జాతీయ రహదారిపై మండలంలోని వెలంపేట వై జంక్షన్ వద్ద అల్యూమినియం పౌడర్ లోడుతో వెళుతున్న ట్యాంకర్ సోమవారం సాయంత్రం బోల్తా పడింది. కాకినాడ నుంచి ఒడిశాకు వెళుతున్న ట్యాంకర్ వై జంక్షన్‌లో ఓ వాహనంపై ముందు వెళుతున్న మహిళను తప్పించబోయి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. విషయం తెలియడంతో రూరల్ ఎస్సై రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఫిర్యాదు అందితే కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం



బొమ్మూరులో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ రితేశ్‌కుమార్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో 400పైగా శాఖలతో బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.లక్ష కోట్లతో వ్యాపారాన్ని నిర్వహిస్తోందని ఆ బ్యాంక్ జోనల్ మేనేజర్ రితేశ్‌కుమార్ అన్నారు. సోమవారం బొమ్మూరు బాలాజీపేట రోడ్డులో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోనే రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ తమదని చెప్పారు. ఖాతాదారుల సౌకర్యార్థం అన్ని రకాల డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. రీజినల్ మేనేజర్ ఎస్.రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ బొమ్మూరు శాఖ రాజమహేంద్రవరం ప్రాంతంలో 50వ బ్రాంచ్ అని అన్నారు. ఈ కొత్త శాఖ వివిధ రాకల లోన్లు మంజూరు చేస్తుందన్నారు. అనంతరం ఏపీ పేపరుమిల్లు ఎదుట వీధిలో కాతేరు బ్రాంచ్‌ను రితేశ్‌కుమార్ ప్రారంభించారు. బొమ్మూరు బ్రాంచ్ మేనేజర్ డి.నరేష్, కాతేరు సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి

నిడదవోలు రూరల్: మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని భార్యపై కత్తితో దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ సోమవారం తెలిపారు. మండలంలోని డి.ముప్పవరం గ్రామానికి చెందిన మల్లిపూడి అంతర్వేది, సునీత భార్యభర్తలు. ఈ నెల 14న మద్యం తాగడానికి అంతర్వేది డబ్బులు అడగటంతో భార్య సునీత నిరాకరించింది. దీంతో తనపై కత్తితో దాడి చేశాడని సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నీలి నాలుక.. నిర్లక్ష్యం వద్దు ఇక

- ఈ వ్యాధితో మూగజీవాలకు ముప్పు
- వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు వ్యాప్తి
- అప్రమత్తత అవసరమంటున్న పశు వైద్యులు



కాకినాడ సిటీ: వానాకాలం వచ్చింది.. వ్యాధులను వెంట తెచ్చింది.. ఈ సమయంలో మూగజీవాల రక్షణకు జాత్రలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గొర్రెలు, మేకల పెంపకంలో వాటి యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్య అధికారులు సూచిస్తున్నారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 1,41,229 గొర్రెలు, 1,01,870 మేకలను పెంచుతూ ఎంతో మంది జీవనోధారం పొందుతున్నారు. వానల రాకతో గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి సోకుతుందని పశు వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధిని ఆయా ప్రాంతాలను బట్టి మూతి వాపు, నోటి పుండ్ల వ్యాధిగా కూడా పిలుస్తుంటారు. మందలో 50 నుంచి 70 శాతం గొర్రెలకు ఒకేసారి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి సోకిన గొర్రెల్లో 20 నుంచి 50 శాతం చనిపోయే ప్రమాదం లేకపోలేదు. అందువల్ల యజమానులు ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశు వైద్యులకు చూపించాలని చెబుతున్నారు.

ఎలా వ్యాప్తి చెందుతుందంటే..

గొర్రెలకు నీలి నాలుక వ్యాధి వైరస్‌ల ద్వారా సోకుతోంది. ఈ వైరస్‌లకు మాధ్యమిక అతిదేయి దోమ జాతికి చెందిన కీటకాలే కారణం. మందలో ఒక గొర్రెకు ఈ వ్యాధి వస్తే, మిగతా వాటికీ వ్యాప్తి చెందుతుంది. ఇది దోమ కాటు కారణంగానే వస్తుంది. ఈ వ్యాధి ప్రభావం ముఖ్యంగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్, డిసెంబర్ నెలల్లో ఎక్కువగా ఉంటోంది.

వ్యాధి లక్షణాలు

- గొర్రెల్లోకి ఈ వైరస్ ప్రవేశిస్తే వారం రోజుల్లోపు 105 నుంచి 106 డిగ్రీల జ్వరం వస్తుంది. ఇది ఐదు రోజులకు పైగా ఉంటుంది.
- జ్వరం వచ్చిన 48 గంటల తర్వాత నోటి నుంచి చొంగ కారడం, నోరు ఎర్రగా మారడం, పెదవులు, చిగుళ్లు, పైదవడ, నాలుక వాచిపోవడం, నాలుక ఇరువైపులా పుండ్లు ఏర్పడి బాగా ఉబ్బి నీలి రంగుకు మారడం జరుగుతుంది.
- గొర్రెలకు రక్తపు జీరలు కనిపించడం, ముక్కు లోపల భాగం నుంచి చీముతో పాటు రక్తం రావడం జరుగుతుంది. ఆ తరువాత ముక్కులో జిగురు ఎండిపోవడంతో శ్వాస తీసుకోలేని పరిస్థితి ఏర్పడి గొర్రెలు, మేకలు చనిపోయే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి సోకిన వాటిలో గర్భస్రావం కూడా అవ్వొచ్చు.
- వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న గొర్రెల కాళ్లకు కూడా పాకుతుంది. గిట్టల మొదటి భాగం ఎర్రగా కందిపోయి వాచి చీము పట్టి నడవలేక పోతాయి. మేత తినలేకపోవడం వల్ల జీవాలు నీరసించి మృత్యువాత పడతాయి.
- వ్యాధి చివరి దశలో నాలుక నీలిరంగుకు మారుతుంది. నోటి నుంచి దుర్వాసన వస్తుంది.

నివారణ చర్యలు

- జబ్బు చేసిన వాటిని మందలోని ఆరోగ్యవంతమైన జీవాల నుంచి వేరు చేయాలి.
- తర్వాత పొటాషియం పర్మాంగనేట్ ఒక శాతం ద్రావణంతో నోటిలో పుండ్లు కడిగి శుభ్రమైన పొడిగుడ్డతో తుడిచి బోరో గ్లిసరిన్ అయింట్‌మెంట్ రాయాలి. లేదా టాపిక్యూర్ ఓరల్‌స్ప్రే కూడా వాడవచ్చు.
- పశు వైద్యుడిని సంప్రదించి పెన్సిలిన్, ఓరల్ ఎన్రోఫ్లాక్సోసిస్ వంటి యాంటి బయోటిక్‌లను, జ్వరం రాకుండా మెలోనెక్స్ ప్లస్ మందులు నోటి ద్వారా గాని, ఇంజెక్షన్ రూపంలో ఐదు నుంచి ఏడు రోజుల పాటు ఇవ్వాలి.
- గొర్రెలు నీరసంగా ఉంటే గ్లూకోజ్, ఎలక్ట్రాల్ పౌడర్‌ను నీటిలో కలిపి తాగించాలి.

ఆయుర్వేద చికిత్స

- ఈ వ్యాధి సోకిన గొర్రెలు, మేకలకు నేరేడు చెక్క 100 గ్రాములు, తులసి ఆకులు 50 గ్రాములు, నేల వేము ఆకులు 50 గ్రాములు నూరి ముద్ద చేసి రోజుకు ఒకసారి చొప్పున 3 రోజులు ఇవ్వాలి.
- 150 గ్రాముల వావిల ఆకులు, 100 గ్రాముల వేపాకు ఒక లీటరు నీటిలో అర లీటరు అయ్యే వరకూ మరిగించి ఆ నీటిని రోజుకు రెండు సార్లు చొప్పున 3 రోజులు ఇస్తే తగ్గిపోతుంది.

జాగ్రత్తలు పాటించాలి



దోమకాటు కారణంగా నీలి నాలుక వ్యాధి వ్యాప్తి చెందుతుంది. గొర్రెల కాపర్లు సాయంత్రం వేళ 6, 7 గంటల లోపే వేపాకు లేదా యూకలిప్టస్ ఆకు లేదా కలబందను కల్చి మంద చుట్టూ వేయాలి. ఈ పొగకు దోమలు దూరంగా పారిపోతాయి. ముఖ్యంగా వ్యాధి సోకిన గొర్రెను మంద నుంచి వేరుచేయాలి. ఎందుకంటే దానిని కుట్టిన దోమ ఆరోగ్యంగా ఉన్న గొర్రెను కుడితే దానికి కూడా వ్యాధి సోకుతుంది. గొర్రెలు, మేకల షెడ్లలో కీటకాలను చంపేందుకు మందులు పిచికారీ చేసుకుంటే వ్యాధి సోకకుండా ఉంటుంది. వీటికి టీకాలు వేస్తున్నాం.

– ఎస్.సూర్యప్రకాశరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, కాకినాడ

బాలిక అదృశ్యం కేసును ఛేదించిన పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఓ బాలిక (17) అదృశ్యమైన సంఘటనను పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. దీనికి సంబంధించి సోమవారం సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం ఆవరోడ్డు రైతు నగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఒక కుటుంబం నివసిస్తోంది. కుటుంబ యజమానికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 11వ తేదీ ఉదయం నిద్రలేచిన ఆ కుటుంబ సభ్యులు ఇంట్లో కుమార్తె లేకపోయేసరికి కంగారు పడ్డారు. తెలిసిన వారందరినీ అడిగి, చివరికి అదేరోజు సాయంత్రం స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీ అంబికా ప్రసాద్ కేసును పర్యవేక్షిస్తూ పోలీసులకు సూచనలు ఇచ్చారు. బాలిక ఇంటి వద్ద, రైల్వే స్టేషన్ వద్ద సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. ఒక యువకుడు తెల్లవారుజామున 4 గంటలకు ఇంటి నుంచి ఆ బాలికతో నడుచుకుంటూ వెళ్లడం సీసీ ఫుటేజీలో పోలీసులు గమనించారు. ఆ బాలిక, యువకుడు గుజరాత్‌లోని అహ్మదాబాద్ వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఆ దిశగా స్థానిక పోలీసులు అప్రమత్తమై అక్కడ పోలీసులకు సమాచారం పంపడంతో వారు 12న వారిద్దరినీ పట్టుకున్నారు. వెంటనే కుటుంబ సభ్యులతో కలిసి రాజమహేంద్రవరం పోలీసులు అహ్మదాబాద్ వెళ్లారు. 15న బాలికను, ఆ యువకుడ్ని పట్టుకుని రాజమహేంద్రవరం తీసుకువచ్చారు. ఇన్‌స్టాగామ్‌లో మధ్యప్రదేశ్ యువకుడు ఆ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. అతనితో ఆ బాలిక వెళ్లింది. పోలీసులు నిందితుడైన యాశ్‌అగర్వాల్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఫిర్యాదు అందిన 20 గంటల్లో కేసును ఛేదించిన సౌత్ జోన్ డీఎస్పీ అంబికాప్రసాద్, రెండో పట్టణ సీఐ వి.శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ బి.వినోద్ తదితరులను ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.23 కోట్లు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీలను సోమవారం లెక్కించామని దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. 33 రోజులకు సంబంధించి రూ.1,23,29,856 వచ్చిందన్నారు. ప్రధాన హుండీల నుంచి రూ.86,25,835, అన్న ప్రసాదం హుండీల ద్వారా రూ.37,04,021 ఆదాయం సమకూరిందని వివరించారు. విదేశీ కరెన్సీతో పాటు బంగారం 21 గ్రాములు, వెండి కిలో వచ్చిందన్నారు. హుండీల్లో పువ్వులు, కరెన్సీ పాడయ్యే వస్తువులు వేయరాదన్నారు. ఆలయ క్షేత్ర పాలకుడు శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కించగా రూ.2,96,819 ఆదాయం సమకూరిందని తెలిపారు. కోనసీమ జిల్లా డీఈఓ, అసిస్టెంట్ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు, మండపేట గ్రూప్ టెంపుల్స్ ఈఓ పీవీవీ ఎస్.కామేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్సై శ్రీనివాస్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

జల్సాలకు అలవాటు పడి..

- గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్
- పరారీలో ప్రధాన నిందితుడు



ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ లతాకుమారి

ప్రత్తిపాడు: వారంతా యువకులే.. జల్సాలకు అలవాటు పడ్డారు.. తక్కువ సమయంలో అధిక సొమ్ము సంపాదించాలని ప్రణాళిక చేసుకున్నారు. గంజాయి విక్రయాలతో ఎక్కువ సంపాదించవచ్చని భావించారు. ఈ నేపథ్యంలో కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన మొగిలి మణికంఠ ఆధ్వర్యంలో సింహాద్రిపురం గ్రామానికి చెందిన కందా సూర్యనారాయణ (సురేంద్ర), ధర్మవరం గ్రామానికి చెందిన వనం ఏసుబాబులు గంజాయి విక్రయాలకు సిద్ధం కాగా ముందస్తు సమాచారంతో పోలీసులు గుట్టురట్టు చేశారు. ఇందులో ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. దీనిపై సోమవారం ప్రతిపాడు పోలీస్ స్టేషన్‌లో పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆ వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ధర్మవరం గ్రామ శివారు తమ్మయ్య చెరువు పుంత రోడ్డులో నలమాటి సరస్వతికి చెందిన మామిడితోటలోని రేకుల షెడ్డులో ఎస్సై పవన్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేసి, 60 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడకు పాడేరు అటవీ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి, ధర్మవరానికి చెందిన వనం ఏసుబాబుకు చెందిన కోళ్లఫారంలో దాచి ఉంచారు. దీనిని మొగిలి మణికంఠ ఆధ్వర్యంలో ఎక్కువ రేటుకు విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. ముందస్తు సమాచారంతో కందా సూర్యనారాయణ, వనం ఏసుబాబులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు బస్తాల్లోని రూ. 3 లక్షల విలువైన 60 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు, బ్యాగులు, చిన్న సైజు కాటాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు మొగిలి మణికంఠ పరారీలో ఉన్నాడు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్సై ఎం.పవన్ కుమార్‌లను డీఎస్పీ లతాకుమారి అభినందించారు.

గ్రహణంమొర్రి శాపమా?

- తుప్పల్లో రోజుల పసికందు
- జీజీహెచ్‌కు తరలించిన స్థానికులు



కాకినాడ జీజీహెచ్‌కు పసికందును తరలిస్తున్న సర్పంచ్ సుధాకర్, వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది

తొండంగి: పిల్లల కోసం ముక్కోటి దేవతలను మొక్కుతున్నా కడుపు పండని తల్లులెందరో ఉంటున్న నేటి సమాజంలో, ఏ తల్లి కన్న బిడ్డో తెలియదు కానీ తుప్పల్లోకి చేరింది. గ్రహణంమొర్రి ఆ పసికందుకు శాపమైందా! లేకుంటే ఆడ జన్మ భారమైందా! చివరికి ఆ బిడ్డ అనాథగా మిగిలింది. కన్న తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన పసికందు తొండంగి మండలం ఒంటిమామిడిలో తుప్పల్లో దర్శనమిచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి చికెన్ విక్రయించే లోవరాజు చెత్త పడేసేందుకు ఒంటిమామిడిలో వాటర్ ట్యాంకు వద్దకు వెళ్లడంతో పసికందు ఏడుపు వినిపించింది. వస్త్రాల్లో చుట్టి ఉన్న వారం రోజుల లోపు వయసున్న పసికందును అతను గుర్తించాడు. వెంటనే సర్పంచ్ అంగుళూరి సుధాకర్‌కు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన సుధాకర్ ఈ విషయం పోలీసులకు, ఐసీడీఎస్ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బందికి తెలిపారు. వారు వచ్చి ప్రథమ చికిత్స చేసిన వెంటనే 108 అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు. లోవరాజు గుర్తించకపోయి ఉంటే ఆ పసికందు వీధి కుక్కలకు ఆహారమయ్యేదని, పసికందును గుర్తించిన లోవరాజును, సర్పంచ్ అంగుళూరి సుధాకర్‌ను, అర్ధరాత్రి సమయంలో స్పందించిన ఐసీడీఎస్, వైద్యారోగ్య శాఖ సిబ్బందిని పలువురు అభినందించారు.



ఒంటిమామిడిలో పసికందు

వ్యవసాయ కనెక్షన్ కోసం 1912కి కాల్ చేయండి

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సాక్షి, విశాఖపట్నం: కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావాల్సిన రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయవచ్చని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని వివిధ మీ–సేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ కార్యాలయాల్లో కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదులో పత్రాలను అప్‌లోడ్ చేసే సమయంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందుకే రైతులు నేరుగా ఏపీఈపీడీసీఎల్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు తమ ఆధార్, రిజిస్టర్డ్ ఫోన్ నంబర్లు, పట్టాదార్ పాస్ బుక్, సర్వే నంబర్లు, వాల్టా సర్టిఫికెట్ నంబర్, కుల ధ్రువీకరణ పత్రం వంటి వివరాలను తెలియజేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావాల్సిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదం.. మిగిల్చిన విషాదం

- గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి
- జి.యర్రంపాలెంలో ఘటన



ప్రమాదంలో మృతి చెందిన దుర్గారావు, వెంకటేశ్వరరావు

రాజానగరం: జి.యర్రంపాలెం వద్ద జరిగిన ప్రమాదం రెండు కుటుంబాలను రోడ్డున పడేసింది. ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం మిగిల్చింది. రాజానగరం మండలం జి.యర్రంపాలెంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు తాపీమేస్త్రీలు మృతి చెందారు. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. కడియం మండలం దుళ్లకు చెందిన గండి దుర్గారావు (37) తుంగపాడులో కౌలుకు తీసుకుని అరటి తోట వేశాడు. అందుకు సంబంధించిన పనులను చూసేందుకు అతని మిత్రుడు జక్క వెంకటేశ్వరరావు (42)తో కలసి బైక్‌పై తుంగపాడుకు వెళ్తుండగా జి.యర్రంపాలెంలో ప్రమాదానికి గురయ్యారు. వారు ప్రయాణిస్తున్న బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోగా, ప్రమాదానికి గురైన ఆ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కొద్దిసేపటికి అటుగా వెళ్తున్న వారు చూసి, 108కి ఫోన్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇదిలా ఉంటే తుంగపాడుకు చెందిన గండి దుర్గారావు, వీరవరానికి చెందిన జక్క వెంకటేశ్వరరావులు వివాహాలు జరిగిన తరువాత కడియం మండలం దుళ్లలో నివాసం ఉంటూ తాపీమేస్త్రీలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ ఘటనపై ఎస్సై మనోహర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుళ్లలో విషాదం

కడియం: గండి దుర్గారావు, జక్క వెంకటేశ్వరరావు మృతితో దుళ్లలో విషాద చాయలు నెలకొన్నాయి. తన స్వగ్రామమైన తుంగపాడులో కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని సేద్యం చేస్తున్న దుర్గారావు ఆ పొలానికి వెళ్తూ ఇలా దూరమైపోవడం అతని కుటుంబాన్ని తీవ్రంగా కలసివేస్తుంది. దుర్గారావుకు భార్య నాగలక్ష్మి, ఒకటో తరగతి చదువుతున్న కుమార్తె సంజనాదేవి ఉన్నారు. భార్య నాగలక్ష్మి ఆరు నెలల గర్భిణి. అలాగే జక్క వెంకటేశ్వరరావుకు భార్య విజయలక్ష్మి, ఇంటర్ చదువుతున్న కుమార్తె, పదో తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. తుంగపాడుకు చెందిన గండి దుర్గారావు కొద్దికాలం కిందట కుటుంబ సమేతంగా దుళ్ల గ్రామానికి మకాం మార్చాడు. అలాగే జక్క వెంకటేశ్వరరావు కూడా వీరవరం గ్రామం నుంచి దుళ్ల గ్రామానికి వచ్చారు. వీరిద్దరూ కలసి కూలి పనులకు వెళుతుండేవారు. పొలం పనికి వెళ్లిన వారు తిరిగి వస్తారనుకున్న కుటుంబ సభ్యులు వారి మరణవార్త విని దిగ్భ్రాంతికి గురయ్యారు.

మోడల్ బాబూ.. అంతా డాబు

- మోడల్ రైతుబజార్‌ను గతంలో ప్రారంభించిన చంద్రబాబు
- ఇప్పటికీ అమలాపురంలో నిరుపయోగంగా..



అమలాపురంలో నిరుపయోగంగా రైతుబజార్‌లోని దుకాణాల సముదాయం



దుకాణాలు లేక మూసివేసిన ప్రధాన గేటు

అమలాపురం టౌన్: ఇరవై నాలుగేళ్ల నుంచీ ఇంతే.. ఎవరూ రాక, వ్యాపారం జరగక చివరికి ఆ 90 దుకాణాల సముదాయం మూత బడింది. అమలాపురంలో మోడల్ రైతుబజార్ అంటూ గతంలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ప్రారంభించిన రైతుబజార్, ఇప్పుడు ఆయన హయాంలో మూతబడటం శోచనీయం. అధికారులు అనాలోచిత నిర్ణయంతో రూ.కోటి వెచ్చించి నిర్మించిన ఈ సముదాయానికి చివరికి తాళాలు వేసే పరిస్థితి వచ్చింది. అమలాపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు అతి సమీపంలో రూ.కోటితో నిర్మించిన రైతు బజార్ మూతపడింది. 90 దుకాణాల సముదాయంతో షెడ్లు, పక్కా భవనంతో ఉండే ఈ రైతు బజార్ కొద్ది రోజులుగా తెరవడం లేదు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఆధీనంలో నడిచే ఈ బజార్‌కు ఇన్‌చార్జి ఎస్టేట్ ఆఫీసర్, సెక్యూరిటీ గార్డు ఉన్నారు. వారు మాత్రం నామమాత్రంగా మూసివేసి ఉన్న ఈ బజార్‌ను రోజూ పర్యవేక్షిస్తున్నారు. 2000 సంవత్సరం నవంబర్ 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అట్టహాసంగా దీనిని ప్రారంభించి రాష్ట్రంలోనే మోడల్ రైతుబజార్‌లా అభివర్ణించారు. తొలినాళ్లలో 25 కూరగాయల దుకాణాలతో అంతంత మాత్రంగా నడిచిన ఈ బజార్ క్రమేపీ అర డజను తర్వాత రెండు చివరకు ఒకే ఒక దుకాణానికి పరిమితమైంది. కొన్నేళ్లు ఈ ఒక్క కూరగాయల దుకాణం ఆ సువిశాల రైతు బజార్‌లో బిక్కుబిక్కుమంటూ ఉంటే ఇప్పుడు వినియోగదారులు రాక.. అమ్మకాలు లేక అదీ ఎత్తివేసే పరిస్థితి వచ్చింది. ఆ ఒక్క దుకాణదారుడు రైతుబజార్ వెలుపల రోడ్డు చెంత తోపుడు బండిలో కూరగాయలు అమ్ముకుంటూ తాత్కాలిక దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అమలాపురం జిల్లా కేంద్రం అయ్యాక అన్ని శాఖలు దినదినాభివృద్ధి చెందుతూంటే ఈ రైతుబజార్ మాత్రం పతనావస్థకు చేరుకోవడం ప్రజలను బాధిస్తోంది. పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానానికి ఇక్కడ ఉన్న రూ.కోట్ల విలువైన దాదాపు అర ఎకరం భూమిని సేకరించి అప్పటి టీడీపీ ప్రభుత్వం అనాలోచితంగా.. మెయిన్ రోడ్డుకు కొంచెం లోనికి నిర్మించింది. నాటి నుంచి నేటి వరకూ ఆ అనాలోచిత నిర్ణయం వల్ల ఈ బజార్ ప్రజల నిరాదరణకు గురవుతూనే వస్తోంది. రూ. కోటితో నిర్మించిన కట్టడాలు నేడు నిరుపయోగంగా పడి ఉన్నాయి. దుకాణాలను వినియోగించకపోవడం వల్ల అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రస్తుతం ప్రధాన గేట్లు కూడా మూసివేశారు.

చేపల మార్కెట్ ఏర్పాటుకు విఫలయత్నం

రైతుబజార్ పేరుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోనే ఉన్నా మెయిన్ రోడ్డును ఆనుకుని ప్రధాన గేటు మాత్రమే ఉంటుంది. లోనికి 150 అడుగుల మేర వెళ్లిన తర్వాత ఓ ప్రహరీలో రెండు గేట్ల రక్షణతో దుకాణాల సముదాయం ఉంటుంది. పట్టణం అంతా దాదాపు కాంప్లెక్స్ నుంచి ప్రారంభమై తూర్పు వైపు విస్తరించి ఉంది. దీంతో రైతుబజార్ పట్టణానికి ఓ మూలకు విసిరేసినట్లు ఉండడమే వినియోగదారులు నిరాధరణకు కారణమైంది. కూరగాయల వ్యాపారులు ఇక్కడ దుకాణాలు పెట్టుకునేందుకు సుముఖత చూపకపోవడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు చేపల మార్కెట్ తేవాలని మత్స్యశాఖ అధికారులతో మాట్లాడి చేసిన ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. చేపల వ్యాపారులూ లాభసాటిగా లేని ఇక్కడకు రావడానికి అయిష్టత చూపారు.

అన్ని ప్రయత్నాలూ చేశాం

రైతుబజార్‌ను వినియోగదారులకు దగ్గర చేయాలని అన్ని ప్రయత్నాలూ చేశాం. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు పలుమార్లు ఈ బజార్‌కు వచ్చి దీనికి ప్రజాదరణ పెంచాలని చూశారు. కనీసం కొంతమందైనా కూరగాయలు, చేపల వ్యాపారులను తీసుకు వచ్చి దుకాణాలు నిర్వహించేలా అవగాహన కల్పించారు. కానీ ఏ ఒక్క దుకాణం రాక గేట్లు వేసి ఉంచుతున్నాం.

–జి.గోవిందు, ఇన్‌చార్జి ఎస్టేట్ ఆఫీసర్, రైతుబజార్, అమలాపురం

భార్యను హత్య చేసిన వ్యక్తికి జీవితఖైదు

కె.గంగవరం: వ్యసనాలకు భానిసై భర్యను హత్య చేసిన ఘటనలో భర్తకు రామచంద్రపురం కోర్టు జీవిత ఖైదు విధించింది. స్థానిక ఎస్సై జానీబాషా కథనం ప్రకారం.. మండలంలోని తామరపల్లి గ్రామానికి చెందిన గుత్తల శేషారావు రెండో కుమార్తె భవానిని కపిలేశ్వరపురం మండలం నాగులచెరువుకు చెందిన మేడిశెట్టి శ్రీనుకు ఇచ్చి 15 ఏళ్ల కిందట వివాహం చేశారు. వీరు తామరపల్లి గ్రామంలోనే నివాసం ఉండేవారు. మొదటి నుంచీ శ్రీను వ్యసనాలకు బానిసై భార్యను వేధిస్తూ వస్తున్నాడు. 2021 సంవత్సరం అక్టోబర్ 13న తండ్రి శేషారావు కూలి పనికి వెళ్లి తర్వాత కూతురి ఇంటి వద్దకు వెళ్లాడు. తాళాలు వేసి ఉండడంతో దగ్గరకు వెళ్లగా ఇంటి నుంచి దుర్వాసన రావడంతో తాళాలు పగలకొట్టి చూడగా భవాని రక్తపు మడుగులో చనిపోయి ఉండడం గమనించాడు. వెంటనే అల్లుడు శ్రీనుపై అనుమానంతో కె.గంగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మేడిశెట్టి శ్రీనును పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి రామచంద్రపురం కోర్టులో వాదనలు జరిగాయి. సోమవారం 5వ అదనపు జిల్లా కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో జడ్జి డి.విజయ్‌గౌతమ్ నిందితుడు శ్రీనుకు జీవితకాలం జైలు శిక్ష విధించడంతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు.